క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవం



చౌడేశ్వరిదేవి పూజలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణ సమీపంలోని ఎద్దులచెరువు వద్ద ఉన్న చౌడేశ్వరి దేవి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంత్యుత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలమనేరు, గంగవరం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని మహిళలు కలశాలతో ప్రదక్షిణగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

గుడివంకలో ఆడి నెల ప్రారంభం



శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

గుడుపల్లి: గుడివంక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడి నెల సోమవారం ప్రారంభమైంది. ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆడి నెలలో ఆగస్టు 3 నుంచి 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భక్తులు ఆడి నెల ప్రారంభం రోజు పశ్చిమ వాహిని కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆడి నెల పూర్తయ్యే వరకు భక్తులు పెద్ద సంఖ్యలో కావడి మొక్కులు చెల్లించడం పరిపాటి.

హైస్కూలుకు కుర్చీల వితరణ



పులిచెర్ల(కల్లూరు): కల్లూరు చంద్ర క్లినిక్‌కు చెందిన చంద్రబాబు, భార్గవి కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలుకు రూ.5వేలు విలువ చేసే కుర్చీలను సోమవారం అందజేశారు. హెచ్‌ఎం శ్రీవాణి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, రాజేంద్ర, వేణు గోపాల్ పాల్గొన్నారు.

పాడి రైతులకు పంచ్ ప్రభాకర్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

సదుం: మండలంలోని చిలకపాటివారిపల్లెకు చెందిన షామీర్‌బాషా, ఎర్రాతివారిపల్లెకు చెందిన రమేష్ ఆవులు మృతి చెందాయి. ఇది తెలుసుకున్న చిలకపాటివారిపల్లెకు చెందిన ఎన్‌ఆర్‌ఐ పంచ్ ప్రభాకర్ ఇద్దరికీ చెరో రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సాయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, శివ, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులపై సమీక్ష



సమీక్షలో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు

చౌడేపల్లె: ఇరిగేషన్ శాఖ ద్వారా మంజూరైన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆ శాఖ జేఈ రాజేంద్ర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, నాయకులతో కలిసి జేఈ సమీక్షించారు. మండలానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో 47 చెరువు కట్టల బలోపేతం పనులు, తూము, మొరవ మరమ్మతు పనులు మంజూరు చేశారన్నారు. ఆయాన పనులు ఏ స్థాయిలో ఉన్నాయో సమీక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

19న మండల సమావేశం

రొంపిచెర్ల: ఈ నెల 19న రొంపిచెర్ల మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

చంద్రబాబును సాగనంపండి

మూడున్నర దశాబ్దాలుగా కుప్పానికి చంద్రబాబునాయుడు రూపంలో పట్టిన శనిని సాగనంపాలని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. వార్డుబాట సభల్లో నాయకులు చంద్రబాబు, టీడీపీ నాయకులపై ధ్వజమెత్తారు. సీఎంగా పనిచేసినా, స్థానిక ఎమ్మెల్యేగా ఉన్నా కుప్పంలో కనీస సదుపాయాలు కూడా కల్పించడంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు.

– కుప్పం (శాంతిపురం)



కుప్పంలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు, నాయకులు

కుప్పాన్ని సీఎం కానుకగా ఇవ్వండి



కుప్పం ప్రజల వెనుకబాటుకు కారణమైన చంద్రబాబును ఇక్కడ ఓడించాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉంది. ప్రతి కుటుంబానికి మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కుప్పాన్ని కానుక ఇవ్వండి. ప్రతి మహిళను తోబుట్టువుగా భావించే సీఎంను బలపరచాల్సిన బాధ్యత అక్కచెల్లెమ్మలపై ఉంది. భరత్‌ను గెలిపిస్తే పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ అభివృద్ధిని పరుగులు తీయిస్తారు. – **వెంకటేగౌడ, ఎమ్మెల్యే**

అరాచకానికి–సంక్షేమానికి తేడా గమనించండి



కుప్పంలో గత 30 ఏళ్ల అరాచకానికి, నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనకు తేడాను ప్రజలంతా గమనించాలి. నిజం మాట్లాడితే టీడీపీ నాయకులు నోరు నొక్కే కాలం పోయింది. అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. జాతర సందర్భంగా తిరుపతి గంగమ్మ గుడి అభివృద్ధి చేయాలని కోరితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏడాదిలోపు ఆలయాన్ని పునర్మించారు. గతంలో ఐదేళ్లకోసారి యామనూరు జాతరలో వేషం వేయడానికి అప్పటి ఎంపీ కుప్పం వస్తే, ఇప్పుడు ఎంపీ రెడ్డెప్ప నిత్యం కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

–భరత్, చిత్తూరు ఎమ్మెల్సీ

ఎవరేమన్నారంటే..

నిందా ముంచిన బాబు



“ నిత్యం అబద్ధాలతో జనాన్ని ఏమార్చడమే చంద్రబాబు పని. ఇంటికో ఉద్యోగం ఇస్తా..మీరు తాకట్టు పెట్టిన బంగారం మీ ఇంటింటికి పంపిస్తా– అని నిండా ముంచారు. రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి హామీ మాఫీ చేశారు. సంక్షేమ పథకాలు ఇస్తే జనం సోమరులవుతారన్న చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఏమి చేస్తారో ఆలోచించండి. అబద్ధాలతో కుప్పం ప్రజలను ఏడుసార్లు ఏమార్చినా ఈసారి బాబు పప్పులు ఉడకవు. 2019 ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98.44శాతం నెరవేర్చారు.

– **గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్**

బాబు ఇల్లు కడతాడట..ఓట్ల కోసం మరో డ్రామా



కుప్పం ప్రజలను చులకనగా చూస్తున్న చంద్రబాబు కనీసం తన ఎన్నికల్లో కూడా ఇక్కడి వారిని ఓటు అడగడం లేదు. కుప్పం వచ్చినా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో తన బస్సులో బస చేస్తారే తప్ప సొంత ఇల్లు కూడా లేదు. తెలంగాణలో ఉంటున్న ఆయన ఇప్పుడు కుప్పంలో ఇల్లు కడతానని, ఇక్కడే ఉంటానంటూ ఓట్ల కోసం మరో డ్రామా ఆడుతున్నారు. కుప్పం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీ ఎం జగన్‌మోహన్‌రెడ్డి , మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషి చేస్తున్నారు. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో మొదటగా టీడీపీ ఓట్లు పోల్ చేయించి గొడవలు పెట్టడం ద్వారా మిగతా ప్రజలు ఓట్లు వేయకుండా చేసేందుకు చంద్రబాబు కుట్రలు చేసినా మంత్రి సహకారంతో వాటిని అధిగమించగలిగాం. – **ఎన్.రెడ్డెప్ప, చిత్తూరు ఎంపీ**

సీఎంతోనే వెనుకబడిన వర్గాలకు మేలు



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు మన రాష్ట్రంలోనే ఎక్కువ మేలు పొందుతున్నారు. మిగతా పార్టీలు కుప్పంలో బీసీలకు ఎమ్మెల్యే టిక్కెట్లు కూడా ఇవ్వని నేపథ్యంలో భరత్‌ను గెలిపిస్తే ఏకంగా మంత్రిని చేస్తామని జగనన్న హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ పలు సంక్షేమ పథకాలు అందించారు. విదేశాల్లో ఉచిత విద్య, వైద్యం అంటుంటే నమ్మేవాణ్ణి కాదు; కానీ ఇక్కడ జగనన్న వాటిని చేతల్లో చేసి చూపారు. చంద్రగిరి నుంచి వచ్చిన బాబును వదిలి స్థానికంగా అందుబాటులో ఉండే భరత్‌ను గెలిపించండి. – **డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ**

ఎగనామం పెట్టడం బాబు నైజం



ఏది అడిగినా ఇస్తానంటారు. అడగనివి కూడా చేస్తానంటాడు. ఇంకా ఏమైనా కావాలా? అని అడిగి చివరకు ఏదీ చేయకుండా ఎగనామం పెట్టడం బాబు నైజం. అందుకే రాష్ట్రంలో ఎవరూ ఆయన్ను నమ్మడం లేదు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కుప్పంలో బలిజ భవన్‌కు స్థలం కేటాయించాం. కోర్టులో ఉన్న స్థలాన్ని బలిజలకు చూపి బాబు మోసం చేస్తే, కేసులు పరిష్కరించి ఈ ప్రభుత్వం స్థలాన్ని బలిజలకు అప్పగించింది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అడిగిన మంత్రి పెద్దిరెడ్డికి ఇక్కడి పరిస్థితులు, అవసరాలు బాగా తెలుసు. అందుకే అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తున్నారు. **–పోకల అశోక్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు**

అందరి సహకారంతోనే అభివృద్ధి



సీ ఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప, ఇతర నాయకుల సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. కుప్పానికి రూ.66 కోట్లు కేటాయించి, అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. పేదలకు మరింత మెరుగైన వైద్యం అందేలా మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. నాడు–నేడుతో ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ రూ.24 లక్షలతో ఆర్వో వాటర్ ఇస్తున్నాం. **డాక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్, కుప్పం**

‘జగనన్న సురక్ష’తో సమస్యలు పరిష్కారం



పుంగనూరులో..



వి.కోట : మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ముందంజలో ఉన్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరవీధి, బజారు వీధి, తూర్పు మొగశాల, నక్కబండ ప్రాంతాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్రతో కలసి నిర్వహించారు. పలువురికీ ధృవ పత్రాలను పంపిణీ చేసి చైర్మన్ మాట్లాడారు. 17 రోజుల్లో 1,389 అర్జీలు వచ్చాయని, వీటిలో ఇప్పటి వరకు 1,256 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులతో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రేష్మా, మనోహర్, కాళిదాసు, కన్వీనర్ వరదారెడ్డి, పార్టీ నాయకులు ఇంతియాజ్, ఖాదర్‌బాషా, అస్లాం మురాధి, రమణ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పెద్ద భర్నిపల్లెలో..

వి.కోట: మండలంలోని పెద్దభర్నిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ యువరాజు 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. వలంటీర్లు జగనన్న సురక్షపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వినోదా, ఎంపీటీసీ రామచంద్రప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నడిగడ్డలో..

సదుం: మండలంలోని నడిగడ్డ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు.

చెరువుల ఆక్రమణలు తొలగించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

రామకుప్పం: మండలంలో చెరువుల ఆక్రమణలను తొలగించాలని వీఆర్‌ఓలను తహసీల్దార్ మురళి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్‌ఓలతో ఆయన సమావేశమై మాట్లాడారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి సకాలంలో అవసరమైన ధృవీకరణ పత్రాలను అందజేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, వీఆర్‌ఓలు హరినాథ్ రెడ్డి, ఆనంద్, మహేష్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష



సమీక్షిస్తున్న జిల్లా సర్వశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణారెడ్డి

పలమనేరు: స్థానిక ఓఎల్ఎల్ స్కూల్‌లో పలమనేరు, గంగవరం మండలాల ఎంఈఓలు, ఫేజ్–2 హెచ్‌ఎంలు, ఏఈలు, సీఆర్పీలు, సచివాలయ కార్యదర్శులతో జిల్లా సర్వశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణారెడ్డి సోమవారం సమీక్షించారు. జూలై 31 నాటికి 2వ దశ నాడు–నేడు పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో బడికిరాని పిల్లల వివరాలను సేకరించి వారిని బడిలో తిరిగి చేర్పించాలని ఆదేశించారు. ఇప్పటికే వలంటీర్లు చేస్తున్న ఇంటింటా సర్వే వివరాల ఆధారంగా డ్రాపౌట్లపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

తల్లీబిడ్డ క్షేమం కోసమే..



పౌష్టికాహారం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న అమ్ము, కౌన్సిలర్ కాంతమ్మ

పుంగనూరు: తల్లీ బిడ్డ క్షేమంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న సంపూర్ణ పోషణ పదార్థాలను అందజేస్తున్నట్లు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము అన్నారు. సోమవారం స్థానిక ఉబేదుల్లా కాంపౌండులో కౌన్సిలర్ కొండవీటి కాంతమ్మతో కలసి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, పిల్లలకు జగనన్న పోషక పదార్థాలను పంపిణీ చేశారు. అలాగే కౌన్సిలర్ పూల త్యాగరాజు ఆధ్వర్యంలో కోనేటిపాళ్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పాలేటమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకి

సోమల : మండలంలోని నెల్లిమంద పంచాయతీలో రెండ్రోజుల పాటు నిర్వహించిన పాలేటమ్మ జాతర సోమవారం ముగిసింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకీలను ఆలయం వద్దకు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సోమవారం ఉదయం మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు సమర్పించారు. జాతర తిలకించేందుకు సోమల, కందూరు, సదుం, కలికిరి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు కార్య నిర్వాహకులు అన్నదానం చేశారు.

నేడు జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది నుంచి పీజీ దాకా చదివిన యువతీ యువకులకు ఈ జాబ్‌మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మొత్తం 40 రకాల ఉద్యోగాల ఎంపికకు ఐదు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని, దీనిని నియోజకవర్గ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెలీకాలర్స్, సెక్యూరిటీ గార్డులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్ పరిశ్రమకు కార్మికులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, బిజినెస్ రెప్రజెంటేటివ్స్ తదితర ఉద్యోగాలు ఉన్నట్టు చెప్పారు. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లో నియమిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి



ప్రత్యేకాలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని బూరగమంద పంచాయతీ మొరవమీదపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. ప్రత్యేకాలంకారంలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో అన్నదానం చేశారు. జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలోనూ జయంతి ఉత్సవాలు నిర్వహించారు.

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అర్చకులు రాజశేఖర దీక్షితుల ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించరూ!

పెద్దపంజాణి: ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని వివిధ ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ లోకేశ్వరరావుకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. మాల మహానాడు సభ్యులు, మంజునాథ్, తిప్పయ్య, జయప్ప, శివప్ప, రంపగప్ప పాల్గొన్నారు.

వాహనం సహా తమిళనాడు బియ్యం పట్టివేత

● స్మగ్లర్ అరెస్ట్

పలమనేరు: తమిళనాడు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఆరు టన్నుల బియ్యాన్ని వాహనంతో సహా గంగవరం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి సీజ్ చేసినట్టు సోమవారం తెలిపారు. టమాటా బాక్సుల్లో బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో కలసి మామడుగు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఐచర్ వాహనాన్ని తనిఖీ చేయగా టమాటా బాక్సుల్లో తమిళనాడు బియ్యం ఉన్నట్టు గుర్తించి వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన స్మగ్లర్ షణ్ముగశెట్టిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

థ్యాంక్యూ పెద్దిరెడ్డి సార్!



మంత్రికి కృతజ్ఞతలు చెబుతున్న ఎంసీఓలు

మంత్రి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన స్వచ్ఛ భారత్ ఉద్యోగులు

పలమనేరు: గతంలో సాక్షర భారత్‌లో కో–ఆర్డినేటర్లుగా పనిచేస్తూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలను కోల్పోయి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో మళ్లీ ఉద్యోగాలు పొందారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఇచ్చిన హామీని నెరవేర్చారు. దీంతో స్వచ్ఛ భారత్ కో–ఆర్డినేటర్లుగా నియమితులైన పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ఉద్యోగులు సోమవారం కుప్పంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం పుణ్యమా అని రాష్ట్రంలో మొత్తం 3,600 మంది తిరిగి ఉద్యోగాలు పొందారన హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 60మంది ఉన్నట్టు చెప్పారు. తమ ఉద్యోగాల కోసం సహకరించిన స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్, ముఖ్య నాయకులకు ధన్యవాదాలను తెలిపారు. మంత్రిని కలసిన వారిలో యూనియన్ నాయకులు సుధాకర్, సిద్ధారెడ్డి, సురేష్‌బాబు, వాసు, మోహన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

రామకుప్పం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటన సందర్భంగా సోమవారం రాజుపేట రోడ్డులో మండల వైఎస్సార్ సీపీ నేతలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో– కన్వీనర్ చంద్రారెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షుడు అప్పి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, రామిరెడ్డి, యశ్వంత్‌రెడ్డి ఉన్నారు.

మసీదు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: స్థానిక మేదరదొడ్డిలో నూతన జామియా మసీదు నిర్మాణానికి సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి భూమిపూజ చేశారు. మైనారిటీలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఎంఎం గ్రూప్ చైర్మన్ మహమ్మదాలి సహకారంతో మసీదు నిర్మాణ పనులు చేస్తున్నట్లు పెద్దిరెడ్డి చెప్పారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక దువా అనంతరం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచులు వరుణ్, ఓబుల్‌రెడ్డి, ఉపసర్పంచ్ అల్తాఫ్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఇంజినీర్ ఇస్మాయెల్, ఎంఎం ఆనంద్, వెంకటరమణ, ముతవల్లీ ఖాదర్ బాషా, కార్యదర్శి బాబాజాన్, మహమ్మద్ షఫీ, మైనారిటీ నేతలు ఫజుల్లా, అన్సర్‌బాషా, జమీల్‌బాషా, ఫాజిల్, సద్దాం ,అలీంబాషా, అల్లాభక్ష్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ వ్యవసాయం లాభసాటి



విరూపాక్షపురం వద్ద డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారులు

బైరెడ్డిపల్లె: రైతులు డ్రిప్ పద్ధతిలో వ్యవసాయం చేస్తే నీటి ఆదాతో పాటు లాభసాటిగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, పీడీ రమణారెడ్డి సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం వారు పర్యటించారు. రైతులు డ్రిప్ విధానంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. డ్రిప్ పరికరాల నాణ్యతలో లోపం వస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్‌ఐఈ పవన్, ఎంఐఈఓ సంధ్య, డ్రిప్ కంపెనీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్‌ను సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల: వాటర్ షెడ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్‌జీ. రంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కేవీ.నాగమాధురి కోరారు. సోమవారం మండలంలోని వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. వివిధ పంటలలో నూతన రకాలను ఎంచుకోవాలన్నారు. ఒకే రకం పంట సాగు చేయడం వలన దిగుబడి తగ్గి పోతుందన్నారు. అలాగే వాటర్‌షెడ్ పథకంలో నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్లు హరికృష్ణారెడ్డి, మదన మోహన్‌రెడ్డి, చంద్రయ్యనాయుడు, సర్పంచులు, వాటర్ షెడ్ సిబ్బంది పాల్గొన్నారు.